నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, మంగళవారం 29 ఏప్రిల్ 2025 | NALGONDA

# సభను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు

- రజతోత్సవ సభ విజయవంతం చేసిన ప్రజలకు ధన్యవాదాలు
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్



సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 28 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేసిన అన్ని వర్గాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. సభలో పార్టీ అధినేత కేసీఆర్ ప్రజలకు అనేక విషయాలపై తన సందేశం వినిపించారని, కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనను, ఫెయిల్యూర్ కండ్లకు కట్టినట్లు వివరించారని అన్నారు. పోలీసు అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తలపై పెడుతున్న తప్పుడు కేసులను ఎదుర్కొనేందుకు తాను లీగల్ సెల్‌కు అండగా ఉంటానని భరోసా ఇచ్చారని చెప్పారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని స్పష్టం చేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సభకు హాజరైన ప్రజలు, కేసీఆర్ మాట్లాడిన మాటలను చూసి బెంబేలెత్తిన కాంగ్రెస్ నాయకులు లేని పోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు మాటలు, అబద్ధాల్లో కాంగ్రెస్ నాయకులు ఆరితేరారని ప్రజలు గ్రహించారని, ఇకనైనా మారి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛందంగా లక్షలాదిగా ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేసి దేశంలోనే చరిత్ర సృష్టించారని, బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వాతావరణం కూడా సహకరించిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడైనా ప్రజల కోసమే పని చేస్తుందని, కేసీఆర్ నాయకత్వంలో ముందుకు సాగుతుందని చెప్పారు.

# చేనేత కార్మికులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

## మే 1న రానున్న మంత్రి తుమ్మలను అడ్డుకోవాలి : కొంక లక్ష్మీనారాయణ

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 28 : రైతుల మాదిరిగానే చేనేత కార్మికులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, జియో ట్యాగింగ్ కలిగిన చేనేత కార్మికులకు చేనేత సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పించాలని పోచంపల్లికి చెందిన చేనేత నాయకుడు కొంక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. చేనేత కార్మికులందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని, చేనేతకు బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 1న పోచంపల్లికి విచ్చేయనున్న రాష్ట్ర చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును అడ్డుకోవాలన్నారు.

# బీఆర్ఎస్‌లో ఫుల్ జోష్

## వరంగల్ సభ సక్సెస్‌తో నూతనోత్సాహం



- కేడర్‌లో ధైర్యం నింపిన అధినేత కేసీఆర్ ప్రసంగం
- అంతటా రజతోత్సవ సభ జన సందోహంపైనే చర్చ
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సభ ఎఫెక్ట్
- అధికార పార్టీ ఆశావహుల్లో ఆందోళన
- మరింత ఉత్సాహంగా పని చేస్తామంటున్న బీఆర్ఎస్ శ్రేణులు






ఇసుకేస్తే రాలనంత జనంతో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ భారీ సక్సెస్ అవడం బీఆర్ఎస్ శ్రేణులకు ఫుల్ జోష్ ఇచ్చింది. పార్టీ అధినేత కేసీఆర్ పవర్‌ఫుల్ స్పీచ్.. దిశానిర్దేశం కేడర్‌లో నూతనోత్తేజం నింపింది. పార్టీలోని అన్ని వర్గాల్లో ఉత్సాహం ఉరకలేస్తున్నది. మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులు అవుతున్నారు. వరంగల్‌లో సభ సక్సెస్ స్థానిక సంస్థల ఎన్నికలపై పడనుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ)

### సన్నాహక సమావేశాలతో షురూ..

బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తి భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. నెలన్నర ముందు నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తొలుత మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలతో జిల్లాల వారీగా భేటీ అయ్యారు. బహిరంగ సభకు సంబంధించి వారికి దిశానిర్దేశం చేశారు. దాంతో సభ విజయవంతానికి ఆయా నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మార్గదర్శకంలో అన్ని మండల కేంద్రాలు, పట్టణాల్లో పెద్దఎత్తు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ ముఖ్యులు, మాజీ ప్రతినిధులతో మాజీ ఎమ్మెల్యేలు సమావేశమై వివిధ అంశాలపై చర్చించి ఉత్సాహం నింపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బస్సులు, కార్లు, ప్రైవేట్ వాహనాల్లో పెద్దఎత్తున తరలివెళ్లారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా కేసీఆర్‌ను చూసేందుకు, ప్రసంగం వినేందుకు ఆసక్తి కనబర్చారు.

### శ్రేణుల్లో నూతనోత్తేజం..

వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ భారీ సక్సెస్ అవడంతో బీఆర్ఎస్ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాయి. కొంత కాలంగా స్తబ్దుగా ఉండడంతో సైలెంట్‌గా ఉన్న కేడర్‌లో ఒక్కసారిగా జోష్ వచ్చింది. గ్రామాలు, పట్టణాల్లో నేతలు యాక్టివ్ అయ్యారు. ప్రజా సమస్యలపై మరింత కొట్లాడేందుకు సన్నద్ధమవుతున్నారు. అంతేగాక పార్టీ శ్రేణులకు కేసీఆర్ ఇచ్చిన ధైర్యంతో ముందుకు కదిలేందుకు సిద్ధమవుతున్నారు. 'కేడర్‌కు అండగా ఉంటా. అధికార పార్టీపై గట్టి కొట్లాడాలి. మీకేమైనా లీగల్ టీమ్ చూసుకుంటుంది. అధికారంలోకి వచ్చేది మనమే.. అధైర్యపడవద్దు' అని సభలో కేసీఆర్ ఇచ్చిన భరోసాతో శ్రేణుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. దాంతో పార్టీ కోసం మరింత ఉత్సాహంగా పనిచేస్తామని శ్రేణులు పేర్కొంటున్నాయి. మరోవైపు ఎక్కడ చూసినా వరంగల్ బహిరంగ సభ ముచ్చట్నే వినిపిస్తున్నాయి. హోటళ్లు, బస్టాండ్లు, హెయిర్ సెలూన్లు, చికెన్ సెంటర్లు, దుకాణాలు, టీ స్టాళ్లు ఇలా అన్నిచోట్ల కేసీఆర్ ప్రసంగం, బీఆర్ఎస్ సభ విజయవంతం గురించే మాట్లాడుకుంటున్నారు. సభ జరిగిన తీరు, కేసీఆర్ స్పీచ్, జన సందోహం తదితర అంశాలపై చర్చోపచర్చలు చేస్తున్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం

కేసీఆర్ సభతో రాష్ట్ర రాజకీయాలు కీలక మలుపులు తిరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కేసీఆర్ అంటేనే రాజకీయ చతురతకు మారుపేరు అన్న విషయం అందరికీ తెలిసిందే. ఇప్పటికే ప్రభుత్వంపై జనంలో తీవ్ర వ్యతిరేకత ఉండడం బహిరంగంగానే కనిపిస్తున్నది. త్వరలో వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కేడర్‌లో ఇప్పటి నుంచే మంచి ఊపు తీసుకురావడంలో కేసీఆర్ సక్సెస్ అయ్యారనే చర్చ నడుస్తున్నది. సభ ప్రభావం వచ్చే ఎన్నికలపై పడనుందని పేర్కొంటున్నారు. దీంతో వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే అధికార పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగలనుంది.

### అధికార పార్టీ ఆశావహుల్లో టెన్షన్

ఒక్క బహిరంగ సభతో రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ టర్న్ చేయడంతో అధికార పార్టీ ఆశావహుల్లో ఆందోళన నెలకొంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటికే అనేక మంది అధికార పార్టీ ఆశావహులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పండుగలు, పబ్బాలు, ఫంక్షన్లకు జోరుగా ఖర్చు చేస్తున్నారు. కొంత మంది ఏకంగా తామే గెలుస్తామంటూ ప్రచారం చేసుకున్నారు. తాజా వరంగల్ సభతో అంచనాలన్నీ తారుమరు అయ్యే పరిస్థితులు ఉన్నాయనే టెన్షన్ వారిలో మొదలైనట్లు తెలుస్తున్నది. భవిష్యత్‌లో బీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు ఉండనున్నట్లు సమాచారం.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

# బీఆర్ఎస్ రజతోత్సవ సభ సూపర్ సక్సెస్

- ఎన్ని అడ్డంకులు సృష్టించినా జనం తరలివచ్చిండ్రు
- మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 28 : వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవకు అధికార పార్టీ నాయకులు ఎన్ని అడ్డంకులు కలిగించినా జనం, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారని, సభ సూపర్ సక్సెస్ అయ్యిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సభకు రాకుండా అడుగడుగునా పోలీసులు ఆంక్షలు, నిర్బంధాలు పెట్టారని, అయినా ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు వాటిని ఛేదించుకుంటూ సభకు వచ్చారని తెలిపారు. అధికారులను పెట్టి వాహనాను చెక్ చేయించారని, సభకు అద్దె బస్సు ఇచ్చిన స్కూళ్లకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను నమ్మించి మోసం కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గాజుల ఆంజనేయులు, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, నీల రవికుమార్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# వరంగల్ సభకు వెళ్లకుండా ఇసుక లారీలు అడ్డుపెట్టిండ్రు

- కార్యకర్తలతోపాటు ఐదు కిలోమీటర్లు నడిచాం
- 16 నెలలైనా ఇచ్చిన హామీలు అమలు చేయలే..
- గ్రామాల్లో తిరగాలంటే కాంగ్రెస్ నాయకులకు వణుకు
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక లారీలు అడ్డుపెట్టించి అడ్డుకున్నదని, కార్యకర్తలతో పాటు ఐదు కిలోమీటర్లు తనతోపాటు మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు నడిచి సభా ప్రాంగణానికి చేరుకున్నామని, దాదాపు మూడు లక్షలకు పైగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను సభకు రానీయకుండా కుట్రలు చేసి అడ్డుకుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అసహనం వ్యక్తం చేశారు. నకిరేకల్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసినందుకు నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావడం, కేసీఆర్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు ఎదురుదాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. రజతోత్సవ సభలో కేసీఆర్‌పై ప్రజలకు ఉన్న ఆదరణ చూసి తట్టుకోలేక మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు మీడియాలో విషం కక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. పాలనలో తప్పులను సరిచేసుకోవాల్సింది పోయి సిగ్గులేకుండా కేసీఆర్‌పై ఎదురుదాడి చేస్తే ఏదో గొప్పోళ్లమవుతామని అనుకోవడం వారి అవివేకమన్నారు. కాంగ్రెస్ అంటేనే ఎదురు దాడులు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం, ప్రతిపక్ష నాయకులు మాట్లాడకుండా గొంతునొక్కడమని ఆరోపించారు. 16 నెలలైనా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరుగాలంటే భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభకు హాజరు కావాలని, కేసీఆర్‌ను చూడాలని, సందేశం వినాలని వచ్చి ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు సభను విజయవంతం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నకిరేకల్, కేతేపల్లి మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు పెండెం సదానందం, సామ శ్రీనివాస్‌రెడ్డి, రావిరాల మల్లయ్య, దైద పరమేశం, సత్యనారాయణ, అవిరెండ్ల జనార్దన్, చిట్యాల అశోక్ పాల్గొన్నారు.

# కనీవిని ఎరుగని రీతిలో రజతోత్సవ సభ

- లక్షలాదిగా తరలివచ్చిన జనం చూసి కాంగ్రెస్ అక్కసు
- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



హాలియాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఏప్రిల్ 28 : వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా జరిగిందని, లక్షలాదిగా తరలివచ్చిన జనంతోపాటు పార్టీ శ్రేణులు, అభిమానులను చూసి కాంగ్రెస్ నాయకులు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు.హాలియాలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజతోత్సవ సభ విజయవంతం కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ నేతల కండ్లు బైర్లు కమ్మాయని, వెన్నులో వణుకు పుట్టిందన్నారు. సభను తక్కువ చేసి చూపేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ సభకు జనం రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటం, రాష్ట్రం సాధించుకున్న తర్వాత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన ప్రగతిని కేసీఆర్ సభలో వివరించారని, ఎక్కడా అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్ మాట్లాడలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు కేసీఆర్‌ను ఉద్దేశించి గతంలో కండ్లు పీకి గోలికాయలు ఆడుతా, లాగుల్లో తొండలు వదులుతా అంటూ వల్గర్ లాంగ్వేజీ వాడారని గుర్తు చేశారు. ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలం చెందిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ విజయవంతం కావడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని తెలిపారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. సభను విజయవంతం చేసిన రాష్ట్ర ప్రజలు, నాగార్జున సాగర్ నియోజవర్గ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపా రు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు రమణరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి దోరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు అల్లి పెద్దిరాజు, హాలీం, జలీల్ పాషా, అంజత్‌ఖాన్, సీకే రమేశ్, ఎల్లయ్య పాల్గొన్నారు.



వలిగొండలో ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న లోతుకుంట గ్రామ రైతులు

# ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

వలిగొండ, ఏప్రిల్28 : ధాన్యం తెచ్చి 15 రోజులవుతున్నా కొనుగోళ్లు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం వలిగొండ మండలం కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోళ్లు ప్రారంభానికి నోచుకోలేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా లోతుకుంట గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ 15 రోజు క్రితం వరి కోతలు పూర్తి కాగా ధాన్యాన్ని లోతుకుంటలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రానికి తీసుకొచ్చామని తెలిపారు. కానీ ఏపీఎం జానీ నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని, కొనుగోళ్లు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లపై హామీ ఇస్తేనే ఇక్కడి నుంచి కదులుతామని భీష్మించి కూర్చున్నారు. అనంతరం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు ఏపీఎం హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. రాస్తారోకోకు సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, కల్యాకి రాంచందర్, బీజేపీ మండలాధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, రాచకొండ కృష్ణ, మారోజు అనిల్‌కుమార్ మద్దతు తెలిపారు.


# కాంగ్రెస్ హామీలన్నీ నీటి మూటలే

- ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా



యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 28 : ఎన్నికల ముందు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి విస్మరించిందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అనేకమంది అర్హులు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నా ఇప్పటివరకు మంజూరు చేయలేదన్నారు. జిల్లా రైతాంగానికి సాగునీరు అందించే బస్వాపూర్ రిజర్వాయర్, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, గంధమల్ల, శివన్నగూడెం ప్రాజెక్టులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం కరువైందని, జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని, ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యం అందక గాంధీ, ఉస్మానియా దవాఖానలకు వెళ్లాల్సి వస్తున్నదని చెప్పారు. నీళ్లు లేక వరి పంటలు ఎండిపోయి అనేక మంది రైతులు నష్టాల బారిన పడ్డారని, వారికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వాలని రావాల్సిన వాటాలను ఇవ్వడం లేదని, కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ స్థాయి పేద ప్రజలకు అందించడంలో విఫలమైందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. పహల్గామ్‌లో జరిగిన దాడి కేంద్ర ప్రభుత్వ రక్షణ విభాగం నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసాచారి, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, సిర్పంగి స్వామి, బొడ్డుపల్లి వెంకటేశం, ఎండీ పాషా, బొల్లు యాదగిరి, గంగదేవి సైదులు, మద్దెల రాజయ్య, గడ్డం వెంకటేశ్, ఎంఏ ఇక్బాల్, వనం ఉపేందర్, కోట రామచంద్రారెడ్డి, రాగీరు కిష్టయ్య, బల్గూరి అంజయ్య, గోశిక కరుణాకర్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల నాయకులు

# కర్రెగుట్టలో నరమేధాన్ని ఆపాలి

## సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల నిరసన

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 28 : ఛత్తీస్‌గఢ్–తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని కర్రెగుట్టల్లో కొనసాగుతున్న నర మేధాన్ని ఆపాలని, మావోయిస్టుల పార్టీతో చర్యలు జరిపే వాతావరణం కల్పించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వక్కవంతుల కోటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌కి వ్యతిరేకంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పిలుపు మేరకు వామపక్ష పార్టీలతో కలిసి నల్ల జెండాలు, ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. సరిహద్దు ప్రాంతంలో ఉంటున్న ఆదివాసీ, గిరిజనులు ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బతుకుతున్నారని, దాదాపు 20వేల మంది సాయుధ పోలీసు బలగాలు అక్కడ తిష్ట వేసి ప్రతి రోజూ కాల్పులు జరుపుతున్నారన్నారు. ఈ కాల్పుల్లో 80మందికి పైగా మావోయిస్టు, ఆదివాసీలు హతమైనట్లు వార్తలు వస్తున్నాయని, అడవులన్నీ బాంబుల మోతతో దద్దరిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్, మంత్రి సీతక్క స్పందించి ములుగు, చర్ల ప్రాంతాల్లో ఉన్న బలగాలను వెనక్కి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, సీపీఐ జిల్లా నాయకుడు దంతాల రాంబాబు, ఎల్.భద్రయ్య, ముప్పాని కృష్ణారెడ్డి, డి.లింగయ్య, కోటయ్య, కరీం, మట్టిపల్లి సైదులు, కోట గోపి, దండ వెంకట్‌రెడ్డి, వెంకట్‌యాదవ్ ఉన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మిర్యాలగూడ, ఏప్రిల్ 28: పట్టణంలోని నాగార్జున కళాశాలలో 1994–96 బ్యాచ్‌కు చెందిన ఇంటర్మీడియట్ హెచ్ఈసీ గ్రూప్ విద్యార్థులు సోమవారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు తమకు చదువు నేర్పిన అధ్యాపకులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, అధ్యాపకులు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, పూర్వ విద్యార్థులు దుర్గారెడ్డి, సైదా, వినోద, సరిత పాల్గొన్నారు.